

# చైతన్యరాహిత్యంలో స్త్రీ

## – పవని నిర్మల ప్రభావతి

పధ్నాలుగేళ్ళ అరణ్య వాసం చెయ్యటానికి బయల్దేరిన సీతారాములను లక్ష్మణుడు అనుసరించినప్పుడు అతని అర్ధాంగి ఊర్మిళ, భర్తను అనుసరించ లేకా, రాజాంతఃపురంలో జీవచ్ఛవంలా బ్రతకలేకా చైతన్య రాహిత్య స్థితిలోకి జారిపోయి దీర్ఘనిద్రను ఆశ్రయించింది.

ఆమెకా దుస్థితి కల్గించిన వారెవ్వరూ  ఆమె పట్ల జాలి చూపించ లేదు.

చరిత్ర కూడా ఆమె మానసిక పరిస్థితిని విశ్లేషించలేదు.ఈనాటి అధునాతన సమాజంలో కూడా ... పరిస్థితుల ప్రభావం వల్ల కొందరు స్త్రీలు ఎటువంటి చైతన్య రాహిత్య స్థితిని ఆశ్రయిస్తున్నారంటే అందుకు కారణం ఏమిటి?

మారుతున్న సమాజంలో కూడా స్త్రీలకు ఈ దుస్థితి తప్పక పోతే, ఇహ, అందరూ ఆశిస్తున్న ‘మార్పు’కు అర్ధం ఏమిటి?

నేటి సాంఘిక సమస్యలను కథా వస్తువుగా తీసుకుని అతి హృద్యమంగా మలచిన శ్రీమతి పవని నిర్మల ప్రభావతి గారి రసవత్తర నవల ‘‘చైతన్య రాహిత్యంలో స్త్రీ’’

ప్రతి ఒక్కరూ తప్పక చదివి తీరాల్సిన నవల ఇది.

*(గత సంచిక తరువాయి)*

**పెళ్ళిచూపులకి** రామానుజాచారి, గోమతి, సుమతి, సుమతి ఐదేళ్ళ, మూడేళ్ళ పిల్లలిద్దరూ వచ్చారు. మధ్యవర్తి వచ్చాడు.

రామానుజాచారి హైదరాబాదులో వో ఆఫీసులో క్లర్కుగా పనిచేస్తున్నాడు. నెలకు ఆరువందలు వస్తుంది. బి.కాం. పాసయ్యాడు. అతని  తండ్రి కృష్ణమాచారి చనిపోయి షుమారు నాలుగేళ్ళు నిండిందట.  అతని తల్లి సుభద్రమ్మ వుంది. గోమతి, సుమతి అతగాడి అక్కలు. గోమతికి ఇద్దరు అమ్మాయిలు. పన్నెండేళ్ళు, తొమ్మిదేళ్ళు. ఆమె, ఆమె భర్త వెంకటాచలం గుంటూరులో వుంటున్నారు. వెంకటాచలం గుంటూరులో ఫుడ్ కార్పోరేషన్ లో గుమాస్తా. సుమతి భర్త గోపాలాచారి కర్నూలులో ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. అతగాడూ, అతగాడి తలి వున్నారు.

తర్వాత ఇద్దరు చెల్లాయిలు భారతి, మాలతి వున్నారు. భారతి డిగ్రీ కోర్సుకు వచ్చింది. మాలతి టెన్త్ క్లాసు చదువుతోంది. కృష్ణమాచారికి వో మోస్తరు ఆస్తిపాస్తులు ఉండేవి. పెద్ద కూతుళ్ళు ఇద్దరికీ ఘనంగా పెళ్ళిళ్ళు జరిపి, పురుళ్ళు పుణ్యాలు జరిపించాడు.

రామానుజాచారి ఉద్యోగంలో చేరిన తర్వాత ఆయుర్వేదం వైద్యం మీదే సంసారాన్ని గౌరవంగా నెట్టుకు వస్తుండిన కృష్ణమాచారి హఠాత్తుగా గుండెజబ్బుతో మరణించాడు. తర్వాత సంసారభారం అంతా రామానుజాచారి మీదే పడింది. భారతి, మాలతిల పెళ్ళిళ్ళు చేయాలి. హైదరాబాదులో ఇల్లుంది. ఓ భాగంలో తాముండి, మరోభాగం అద్దెకిచ్చింది సుభద్రమ్మ. మూడువందల రూపాయలు బాడుగ వస్తుంది. ఈ వివరాలన్నీ మధ్యవర్తి చెప్పాడు.

ఆ రోజు ఉదయం నుంచీ అనసూయమ్మ తన 'గుండె జబ్బు' మర్చిపోయి హడావుడిగా తిరిగింది. హల్వా, వడలు చేసింది.

ఊర్మిళకు వడల పిండి రుబ్బటం, పై పనులు చూచుకోవటం క్షణం తీరటం లేదు.

రామానుజాచారి, గోమతి, సుమతి, మధ్యవర్తిగారు వచ్చేసారు.

సీత ఉదయం నుంచి మరింత దర్జాగా కూర్చుని పుస్తకాలేవో తిరగ వేస్తోంది. బాగా అలంకరించుకుంది. తెల్లగా, ఒడ్డూ, పొడవుతో వుండే సీత మరింత అందంగా వుందీ రోజు.

శేషాచారిగారు రామానుజాచారితోనూ, మధ్యవర్తితోనూ కబుర్లు చెబుతున్నారు.

మంచి ఘడియలు చూచి సీతను హాల్లోకి పిల్చుకు వచ్చి కూర్చోబెట్టింది అనసూయమ్మ చాప మీద.

ఊర్మిళ అందరికీ ఫలహారాలు కాఫీలూ అందిస్తోంది. రామచంద్రం మంచి నీళ్ళు అందివ్వటం, వక్కపొడి వగయిరాలు అందివ్వటం చేస్తున్నాడు.

'ఫర్వాలేదు. రామానుజాచారి అందంగా వున్నాడు. సీత వదినెకు సరయిన జోడి.' అనుకున్నాడు లోలోపల రామచంద్రం.

రామచంద్రాన్ని తన చెల్లెలి వరసయ్యే రంగమ్మ కొడుకుగా పరిచయం చేసారు శేషాచారిగారు. బస్సు ప్రయాణంలో రంగమ్మ చనిపోవటం వగైరా చెప్పారు.

ఊర్మిళను గురించిన వివరాలూ చెప్పారు.

భువన మోహనంగా వుంది సీత. ఆమెకు పెట్టిన నగలలో ఎక్కువభాగం ఊర్మిళవే.

చకచక పనులు చేస్తూ బట్టలు మంచివే కట్టుకుని ఉన్నా, ఎక్కువ నగలు పెట్టుకునే వోపిక, తీరిక లేకా, పనివల్ల కొత్తవాళ్ల ముందు సహజంగా కలిగే కాస్తంత బిడియంతోనూ, నుదుట పడుతున్న స్వేద బిందువుల్ని తుడుచుకుంటూ, వాటికి అతుక్కుంటున్న ముంగురుల్ని పైకి తోసుకుంటూ తిరుగుతోంది ఊర్మిళ.

సీతక్కకి కాబోయే భర్తని చాలా కుతూహలంగా, ఏ బిడియమూ లేకుండా పరికించి మరీ చూచింది.

.సీతని ఏవో నాలుగు ప్రశ్నలడిగారు గోమతి, సుమతి, మెల్లిగా చెప్పింది. తర్వాత మగవాళ్ళు హాల్లో మిగిలి పోయారు.

ఆడవాళ్ళు వంటగదిని ఆనుకుని వున్న పక్క గదిలో కూర్చున్నారు.

“సీతా! బాగా చూసావుటే అబ్బాయిని?” అంది గుసగుసగా అనసూయమ్మ. ఆవిడకు చాలా గొప్పగా వుంది. సీత ఆ కుర్రాడు చక్కని జంట అనిపిస్తున్నారు. పైగా సీత అందం ఈ రోజు ద్విగుణీకృతమై కళ్ళు తిప్పుకోలేనట్లుంది. తప్పకుండా వాళ్ళు సమ్మోహితులై పోతారనిపిస్తోంది.

“నే చూసాన్లే అక్కా! చాలా బావున్నాడు. నీకు భలే సరిపోతాడు” అంది ఊర్మిళ.

ఈ రోజు ఊర్మిళ మీద కూడా అనసూయమ్మకి ప్రేమ పొంగి పొరలుతోంది. తెల్లారుఝాము నుంచీ ఊర్మిళ తన వెంటా వెనకా తిరుగుతూ అంత చాకిరీ చేసింది. పైగా అడిగీ అడక్క ముందే తన నగలన్నీ సీతని అలంకరించుకోమని కోరింది. వాళ్ళమ్మ పట్టుచీరెల్లో మంచిది కొత్తది చాలా అందమైనది తానే ఎంపిక చేసి, మరీ కట్టుకోమని ఇచ్చింది.

“బావుంటే నువ్వే ఉంచేసుకో అక్కా! నాకింకా బోలెడన్ని వున్నాయి కదా మా అమ్మవి. పైగా నువ్వేం పరాయిదానివా?” అంది అమాయకంగా.

అంచేత అనసూయమ్మకు తగని ప్రేమ కలిగింది ఊర్మిళంటే! ఛామనఛాయ, చారడేసి కళ్ళతో సన్నగా రివటలా ఉండే ఊర్మిళ పెద్ద అందగత్తేం కాదు కానీ చదువూ నాగరికతా, రకరకాల వూళ్లూ తిరుగుతూ (తండ్రి వుద్యోగరీత్యా), రకరకాల వ్యక్తుల అలంకరణ తీరుతెన్నులు కొంత ఆకళింపు చేసుకోగలిగిన చురుకుదనం ఆ పిల్లకి ఓ ప్రత్యేక ఆకర్షణనీ, అందాన్నీ యిస్తున్నాయంతే.

“రేపు సీత పెళ్ళికి ఓ పదివేలు సర్దాలి, సంతకం చెయ్యమ్మా ఊర్మిళా. నీ డబ్బు వాడుకుంటాం. తర్వాత నీ పెళ్ళికి జమ వేస్తాం. మీ పెదనాన్నదంతా చాదస్తం. నీ డబ్బు వాడటానికి ఒప్పుకోరు. నువ్వే ఒప్పించాలి ఆయన్ని. మనం పరాయి వాళ్ళమా?” అంటే చాలు. ఊర్మిళ పెదనాన్నాను ఒప్పించి మరీ యిస్తుంది.

“నా బంగారు తల్లీ! నీ నోటి మాట నిజమై, నా సీతమ్మకీ సంబంధం కుదిరిపోతే చాల్లే” అంది అనసూయమ్మ ఊర్మిళ బుగ్గలు పుణికి.

ఆ ప్రేమకు ఊర్మిళ చలించి పోయింది క్షణకాలం.

భోజనాలు మరో ఇంట ఏర్పాటు చేయించారు. ఆ సాయంత్రం వచ్చిన వాళ్ళు వెళ్ళిపోయారు, వెళ్లి ఉత్తరం వ్రాస్తామని చెప్పి.

★★★★★

వారం రోజుల తర్వాత ఉత్తరం వచ్చింది. కవరు చింపి చదువుకున్న శేషాచారి క్షణకాలం ఆలోచనలో పడిపోయారు.

“ఏవండీ! ఉత్తరం వచ్చిందా? అమ్మాయి నచ్చిందా వాళ్ళకి. నచ్చకేం తీపా? బంగారు బొమ్మలాటి మన సీత నచ్చకపోవటం ఏమిటి? కట్న కానుకల విషయం ప్రస్తావించారా? మిమ్మల్ని అవి మాట్లాడుకొందికి రమ్మని రాశారా?”

హడావుడిగా వంట ఇంట్లో నుంచి పరిగెత్తుకు వస్తూ అంది అనసూయమ్మ. ఇంకా ఎన్నో ప్రశ్నలు వేసేదే గానీ, ఆమెకు దేవుడిచ్చిన వాక్కు స్పీదు, అంతకంటే ఎక్కువ ప్రశ్నల్ని రానివ్వలేదా నిమిషంలో.

శేషాచారిగారు అనసూయమ్మ వేపు చూసారు. ఎలా చెప్పాలి? చెప్పాక అనసూయ ముఖమూ మాటలూ ఎలా మారుతాయి? ఆయనగారి పెదవుల మీద లీలగా హాసరేఖ వెలువడింది.

“చేసుకున్నంత వారికి చేసుకున్నంత మహాదేవ అన్నట్లు అయింది” అన్నారు నవ్వుతూ.

“అంటే? ఏం వ్రాసారు వాళ్ళు? కట్నం ఎక్కువగా అడిగారా?” అనసూయమ్మ ఆదుర్దాగా అడిగింది.

సీత అందం చూస్తే ఎవరేనా సరే, ‘అసలు మాకు కట్నం వద్దు’ అంటారని ఆమెకు గర్వం. కాస్త కించపడుతూ అడిగిందామాట.

“లేదు. ఊర్మిళ నచ్చిందట వాళ్లకి. ఏ కట్న కానుకలూ అవసరం లేదట. ఊర్మిళ నయితే పెళ్ళాడుతాడట అబ్బాయి. వల్ల అక్కల అభిప్రాయమూ అదేనట. మనకూ ఇష్టమయితే ముహూర్తాలు పెట్టించమని వ్రాశారు.” గబగబా చెప్పి మళ్ళీ ఉత్తరం మరోమారు చదువుకున్నారాయనగారు.

అనసూయమ్మ గారితో బాటు పక్కగదిలో కూర్చుని ఏదో నవల తిరగేస్తున్న సీత, తన కొత్త చీరె మీద ఎంబ్రాయిడరీ డిజైను కుట్టుకుంటున్న ఊర్మిళ, అక్కడే కూర్చుని మౌనంగా విష్ణు సహస్రనామాలు, పురుష సూక్త మంత్రపుష్పం  మౌనంగా కంఠతా పట్టుతున్న రామచంద్రం, గోడ పక్కగా బారుగా వెడుతున్న గండు చీమల్ని ఒక్కోదాని మీదా మన్ను చల్లి అవి తన్నుకుంటుంటే చూస్తూ ఆనందిస్తున్న శ్రీనివాసాచారి... అందరూ త్రుళ్ళిపడ్డారు.

“ఊర్మిళనా? మీ ఊర్మిళనా? సరిగా చదివారా మీరు? మళ్ళీ చదవండి ఉత్తరం” అరిచింది అనసూయమ్మ. వినకూడని మాట విన్నట్లు మెరుపు లేని పిడుగు నెత్తి మీద పడ్డట్లు వుందామెకు.

“మూడు మార్లు చదివాను అనసూయా! నీ లాగే నేనూ భ్రమ పడుతున్నానేమో అనుకుని మరీ మరీ చదివాను. అయినా ఉత్తరంలో  నేను చెప్పిన విధంగానే వ్రాసుంది. వాళ్ళు ఊర్మిళను యిష్టపడ్డారుట. ఊర్మిళనయితేనే చేసుకుంటాడట ఆ కుర్రాడు. సీత అయితే అవసరం లేదుట! కావలిస్తే మరోమారు సీత చేతో, శ్రీనివాసం చేతో, ఊర్మిళ చేతో రామచంద్రం చేతో చదివించుకో.” తాపీగా అన్నారాయనగారు.

అనసూయమ్మ మండిపడింది. “బోడి సంబంధం ఎవడిక్కావాలి? ఊర్మిళను చేసుకుంటారటనా? సీత కంటే ఊర్మిళే బావుందటనా ఆ ఎడ్డి మొహానికి? నల్లగా వున్న ఊర్మిళ ఎక్కడ? బంగారుబొమ్మ నా సీత ఎక్కడ? అసలు ఊర్మిళ చిన్నపిల్ల. సీత పెద్దది. పెద్దపిల్లక్కాకుండా చిన్నపిల్ల పెళ్లి ఎలా చేస్తామనుకున్నారు బడుద్దాయిలు!”

అనసూయమ్మ చిందులు తొక్కుతోంది. సీత అవమానంతోనూ, వో విదమైన ఈర్ష్యతోనూ ఊర్మిళను చూస్తోంది.

ఊర్మిళకు ఆశ్చర్యంగానూ, బాధగానూ వుంది. ‘ఇదేమిటి? ఇలా జరిగిందేమిటి?’ అనుకుంటోంది ఆ అమ్మాయి పదే పదే లోలోపల.

రామచంద్రానికి మా చెడ్డ ఆనందం కలిగిందొక్క సారిగా.

‘దేవుడు లేదు లేదు అనే వాళ్ళంతా వెర్రివాళ్ళు సీతొదినా! దేవుడున్నాడు. నిజంగా వున్నాడు. ఊర్మిళను నానా బాధలు పెడుతోన్న అత్తకి వాత మాబాగా వేశాడు పెరుమాళ్ళు’ అంటోంది అతగాడి హృదయం ఆనందంతో పరవశించి పోతూ.

"బోడి సంబంధం మనకవసరం లేదని వ్రాసెయ్యండి" అంది అనసూయమ్మ చివరగా ఆయాసపడిపోతూ, నేలమీద చతికిలబడి కూర్చుంటూ. ఆమెకీ క్షణంలో నిజంగా 'గుండె నొప్పి' అనిపిస్తోంది.

"త్వరపడకు అనసూయా! నింపాదిగా ఆలోచిద్దాం" అన్నారు శేషాచారిగారు.

"ఏమిటీ ఆలోచించేది? నిజంగా ఊర్మిళకి చేస్తారా ఈ సంబంధం? సీతకి మనకి అది అవమానం కాదా? నా చిట్టితల్లిని వంక పెట్టిన వాడ్ని మరోరకంగా అల్లుడుగా మనింటికి రానిద్దామనుకుంటున్నారా?" ఆవేశంగా అంది అనసూయమ్మ.

"ఆవేశపడకు అనసూయా! సృష్టి ధర్మం అంటూ ఒకటుంది. మనం నమ్మినా మానినా, అది ఏ యుగంలో నయినా ఒక్కలానే ఉంటుంది. ఈ భూమ్యాకాశాలకు సత్యం ఆధారమైనట్లే, మన కర్మాకర్మల ఫలితాలకూ, సృష్టి ధర్మానికీ అవినాభావ సంబంధం వుంది."

"ఈ పాడు వేదాంతం ఎందుకిప్పుడు?" అసహనంగా అరిచింది అనసూయ.

"వేదాంతం నీకు వంటబట్టదు. నేన్నీకు ఎప్పుడూ ఆ ప్రయత్నం చెయ్యను. కానీ ఒక్కసారి ఆలోచించు. మన బంధువులలో ఏ ఆడపిల్లకేనా పెళ్లి సంబంధం వస్తోందని తెలియగానే నువ్వేం చేసేదానివి?" శేషాచారిగారు సాలోచనగా చూశారు భార్య వేపు.

"ఏం చేసేదాన్ని?" వెటకారంగా అంది అనసూయమ్మ.

"మన సీత చాలా అందగత్తె అనీ, దాని అందం ముందు ఆ చూడబోయే పిల్ల సూర్యుని ముందు దివిటీ లాటిదనే గర్వంతో వాళ్ళు పిలిచినా, పిలవకున్నా సీతను వెంట బెట్టుకుని ఆ పెళ్ళివారు వచ్చే సమయానికి హాజరయ్యేదానివి కాదూ? నేను ఎన్నోమార్లు చెప్పాను, ఆ పద్ధతి మంచిది కాదనీ, అవతలి తల్లి తండ్రులకు హాని అనీ. ఏనాడేనా విన్నావా?"

అనసూయమ్మ నిర్ఘాంత పోయింది. ఇబ్బందిగా కదిలింది.

"ఆ పరాయి అమ్మాయిని చూడ వచ్చిన పెళ్ళికొడుకు పెళ్ళివారి ముందు సీతను కావాలని కూర్చోబెట్టేదానివి. ఆ పెళ్ళివారు వెళ్లి...

తాము చూచిన అమ్మాయి నచ్చలేదనీ, ఆ పక్క వచ్చిన మీ బంధువులమ్మాయి (సీత) నచ్చిందనీ, వాళ్ళు ఇష్టపడితే, తాము సీతను పెళ్ళాడుతామనీ, కట్నం అవసరం లేదనీ ఉత్తరం వ్రాసేవారు గుర్తుందా?"

అలాటి ఉత్తరం తమకు వచ్చిందని చెబుతూ మన బంధువులు అవమానంతో బాధపడుతూ ఆ పెళ్లి కావలసిన అమ్మాయి దురదృష్టాన్నీ, అనాకారి తనాన్ని నొచ్చుకుంటూ నీతో చెబుతుంటే నువ్వెంత గర్వపడేదానివో ఆలోచించు.”

పైకి మాత్రం “అబ్బెబ్బే! అదేమన్న మాట? మా సీతనెలా యిస్తాం, మీ అమ్మాయికి వచ్చిన మనువుకి అడ్డం తగిలి’ అనేదానివి. ఐదారు మార్లు ఆ సంబంధాలని ఖాయం చేయమని, పైసా కట్నం అవసరం లేకుండానే, ఏ పెళ్ళిచూపుల ఆర్భాటం లేకుండా కేవలం మన సీత గొప్ప అందం కారణంగా పెళ్లి జరిపించేద్దామనీ, అవతలి వారు ఏడిస్తే ఏడవనీ, అవమానపడితే పడనీ, వాళ్ళ ఖర్మ వాళ్ళది, మన అదృష్టం మనది అంటూ చెప్పి ఉంటావు. నీ బుద్ధి, నీ అనుచిత ప్రవర్తన తెలిసిన నేనే ఆ సంబంధాల వారికి మా అమ్మాయికి అప్పుడే వివాహం చేయదలచుకోలేదంటూ జవాబులు వ్రాసాను. గుర్తుందా?”

అనసూయమ్మకు నోరెండి పోయినట్లయింది. మూడు నామాలతో, గంభీరమయిన ముఖంతో శరీరంలోని అంతర్భాగాలన్నిటినీ, మనసు మారుమూలల్లోని ఆలోచనల్నీ కూడా తెలుసుకోగల, చదవగల సునిశిత చూపులతో, పెరుమాళ్ళుకు మారురూపులా వున్నా భర్త అలా గద్దించి అడుగుతుంటే ఆమె శరీరం కంపించింది ఒక్క సారిగా. ఒకటి కాదు రెండు కాదు. ఆరుగురు బంధువుల అమ్మాయిల విషయంలో తను అలా పిలవని పేరంటంలా సీతను వాళ్లకి చూపినట్లే చూపి ఆ సంబంధాలు చెడగొట్టింది వాళ్ళకి! తీరా భర్త మూర్ఖత్వంతో ఆ మనువులు తామూ ఎగబడి చేసుకోలేదు.

“ఈ నాడు సరిగ్గా నీ విషయంలో, నీ కూతురి విషయంలో యాదృచ్ఛికంగా జరిగిందిది. సీతను పిల్చుకు రాకండి. మా పిల్ల మీ సీత అంత అందగత్తె కాదు అని బ్రతిమాలుకున్నారు కొందరు తల్లులు నిన్ను. సీత, నువ్వు వస్తారేమోనని హడలి చచ్చారు మరికొందరు. నీకప్పుడు నవ్వులాట, గర్వం నీ కూతురి అందం మీద. ఆ కూతుర్ని కన్న నీ మీద నీకే వల్ల మాలిన అహం!

ఈ రోజు దేవుడు నీ కళ్ళు తెరిపించాడు అనసూయా! ఊర్మిళ సీత కంటే అందగత్తె కాదు నిజానికి. కానీ చురుకుదనంతో పనిచేస్తున్న ఆ పిల్ల వినయంలోని ఒకానొక సౌందర్యమో, లేక నీ అహానికి జరగవలసిన ప్రతిక్రియ తాలూకు విధి నిర్ణయమో, అదీగాక తల్లి తండ్రి కరువైన ఊర్మిళకు సంబంధాలు వెతకలేక మనం విసుక్కోకూడదన్న భగవదాశీర్వచనమో... వారిని ఆకర్షించింది. వారిచేత ఈ ఉత్తరం వ్రాయించింది.

నాకు సీత ఊర్మిళ రెండు కళ్ళు. రెండూ సమానమే. రంగనాథం, పద్మావతిలు జీవించి వుండి వాళ్ళు తమ బిడ్డకు ముందస్తుగా వివాహం కుదుర్చుకుని వుంటే మనం కాదనడానికి ఉందా? అడ్డుకోవటానికి ఉందా? సీత పెద్దది ఊర్మిళ చిన్నది అంటూ సాకులు పెట్టేందుకు ఉందా?

కాబట్టి ఈ సంబంధం ఊర్మిళకు ఖాయం చేద్దాం" అన్నారాయనగారు ధృడ నిశ్చయంతో,

అనసూయమ్మ ఏమందో తెలీదు కానీ సీత మాత్రం తన చేతిలోని పుస్తకాన్ని ఒక్క విసురుతో మూలకి గిరవాటు వేసింది.

రామానుజంతో ఊర్మిళ పెళ్లి ఆడంబరంగానే జరిపించారు శేషాచారిగారు.

పెళ్లిపట్ల ఇష్టం లేకున్నా అనసూయమ్మకి చేయక తప్పలేదు. సీతను మాత్రం ఆ పదిరోజులూ తమ పుట్టింటికి పంపింది పెళ్లిలో లేకుండా.

ఊర్మిళ నగలలో కొన్ని అనసూయమ్మ సీత కోసం వాడుకుంది. పద్మావతి నగలలో కొన్ని దాచుకుంది. అవన్నీ ఆ అమ్మాయికి పెట్టేయ్యమని శేషాచారిగారు శత పోరారు. కానీ అనసూయమ్మ ససేమిరా వినలేదు. ఊర్మిళే చెప్పింది. "అక్కకు నేనిచ్చాలే పెదనాన్నా" అని.

అలాగే పద్మావతి పట్టు చీరెల్లోనూ కొన్ని దాచుకుంది అనసూయమ్మ.

ఊర్మిళ పేరిట వుండే పాతికవేలలో పదివేలు పెళ్లి ఖర్చు పోను పదిహేనువేలూ రామానుజం కోరిక మీద ఊర్మిళ పేరిటే ఫిక్స్ డ్ డిపాజిట్ గా వేయించారు శేషాచారి.

పెళ్లి పూర్తయ్యాక రామానుజాచారి తల్లి సుభద్రమ్మ అనసూయమ్మ, శేషాచారిగార్లతో అంది మెల్లిగా. "ఊర్మిళ తండ్రికో ఇల్లుంది కదా. దానిమీద వచ్చే బాడుగ ఇందాకా మీరు తీసుకున్నారు. అలాగే ఇకముందు నెలనెలా మా అబ్బాయి రామానుజం పేరుతో మనియార్డరు చేస్తుండండి."

అనసూయమ్మ నిర్ఘాంతపోయింది వియ్యపురాలి లౌక్యానికి.

శేషాచారిగారు మాత్రం నవ్వారు. "మా తమ్ముడికి అంటే ఊర్మిళ తండ్రికి చెందిన ఆస్తి పాస్తులన్నీ ఊర్మిళవే. నాకు ఒక్క పైసా అవసరం లేదు."

సుభద్రమ్మ సంతృప్తితో వెళ్లి పోయింది.

అనసూయమ్మ హతాశురాలయింది.

"ఆ ఇల్లైనా మన శ్రీనివాసానికి మిగల్చరా? ఆ ఇంటి బాడుగ నెలనెలా మూడువందలు వస్తోంది కదా! అద్దైనా మనం అనుభవించకూడదా? రేప్పొద్దున్న ఊర్మిళకు కాన్పులు వగయిరా ఎవరు జరిపించాలి? మనమేగా? వాటికన్నిటికీ ఎక్కణ్ణుంచి తేవాలి డబ్బు?"

శేషాచారిగారు నవ్వారు. "చూచీ చూడక పది సవర్సుల బంగారం పైగానే లాగేశావు ఊర్మిళది. పెళ్లి ఖర్చు పదివేలంటూనే రెండు మూడు వేల రూపాయల వస్తు సామగ్రి మిగిలి పోయింది దాచేశావు. రంగనాథం, పద్మావతికి చెందిన పాత్ర సామగ్రి అంతా మనింటికే తరలించావు. మరి ఊర్మిళకు రాబోయే కాన్పులూ వగయిరా ఎవరు జరువుతారు? నువ్వే జరపాలి. అసలు మనం జరుపకున్నా రామానుజమే జరుపుకుంటాడు.

ఊర్మిళ ఆస్తికీ, డబ్బుకీ వారసుడు అతగాడే. ఆమె మంచి చెడులూ అతగాడివే. నెలనెలా ఇంటి బాడుగ మూడు వందలూ తీసుకుంటాడు. ఆమె కాన్పులూ, ఖర్చులూ చూచుకుంటాడు. నేను పెళ్ళికి ముందే చెప్పాను, ఇక మీదట ఊర్మిళ బరువు బాధ్యతలన్నీ అతగాడివేనని. నాకు తెలుసు. నువ్వు ఇందాకా క్రోధం, అసూయ అణచుకోగలిగావు. ఇకముందు అణచుకోలేవు. ఏం చేస్తావో ఊర్మిళనీ, దాని బ్రతుకునీ. అంచేత అది ఇక ఎక్కువమార్లు ఇక్కడికి రాదు. పుట్టిల్లంటూ తప్పనిసరిగా రావలసి వస్తే వో రోజు వచ్చి వెళుతుందంతే!

అనసూయా! ఇంత జరిగాక కూడా నీ మనసులో నుంచి ప్రలోభం పోలేదు. తల్లితండ్రి పోయిన దిక్కులేని పిల్ల ఆస్తి కాజేయాలన్న దుర్బుద్ధి పోలేదు. అలా వీలులేక పోయిందన్న కోపం కొండలా వుంది నీలో. నువ్వు శ్రమపడి దోచుకున్నా అది నీకూ నీ పిల్లలకీ దక్కదు. ఆ సత్యం తెలుసుకో."

అనసూయకు భర్త శత్రువులా కనిపించాడా సమయంలో.

ఊర్మిళ హైదరాబాదులో రామానుజం ఇంట కొత్త కోడలిగా అడుగెట్టింది.

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

Post your comments